ఈవారం కథ

అడిగేరు

– గీతాంజలి



ఆనాడు సాయంకాలం నీ బెడ్రూం నాలుగు గోడల మధ్య 'ముండా! గుమ్మంలో నిల్చుంటావటే..' లాంటి తిట్లమధ్య నీచేతి బెల్ట్ దెబ్బలకీ, నీ కాళ్ళతాపులకీ తట్లు తేలి, నలిగి–నీరసపడిపోయిన సీత ఆనాడే.. ఆ సాయంకాలమే నన్నిలా అడిగింది.

అకా.. అకా.. నే..నే.. నేను.. ఎందుకు అబ్బా.. హెందుకక్కా.. నేను దే..వు..ణ్ణి.. ప్రా..ప్రా.. ప్రార్థించాలి?? తెలిసీ నేనే పాపవూ చేయలేదే! ఎందుకక్కా!! శిక్ష.. ఈ శిక్ష నాకెందుకు? హ..బ్బా.. అకారణంగా బాధించే వాణ్ణి.., ఏ..ఏ..కారణం వల్ల ప్రార్థించమంటావు?' అస్తమానూ నా శరీరాన్ని.. నన్ను.. అనుమానంతో రోజూ హ..బ్బా.. రోజూ మానభంగం చేసే వాణ్ణి.. అసలు వీడితో నేను ఎందుకు కాపురం చెయ్యాలి.. చెప్పు.. హ..బ్బా.. చెప్పక్కా.. అని ఏడుస్తూ.. గుండెలవిసేలా రోదిస్తూ అడిగింది నన్ను. నేనేం చెప్పను? నీ కాలి తాపులకి.. చెంప దెబ్బలకి.. పిడిగుద్దులకి.. సీత పిప్పి..పిప్పి..అయిపోయింది. నేను జవాబు చెప్పేలోపున సీత.. నీరసంతో.. నిస్త్రాణతో నేలకూలిపోయింది.. అవును.. స్పృహ తప్పి పడిపోయింది.



ఓనాడు.. గ్నాపకం వుందా?–ఊరవతల మీ పువ్వులతోటలో రాత్రి ఎనిమిదిన్నరకి, చిక్కని చీకట్లో.. గుర్తుందా? మీ మంచి నీటి బావి పక్కనున్న మామిడి చెట్టునీంచి చీకట్ని మింగుతూ కూర్చున్న గబ్బిలమొక్కటి కూసినపుడు.. గ్నాపకం లేదు?.. మీ బంతిమొక్కల మధ్య ముసలి తోటమాలి కూతురు.. పదారేళ్ళ మల్లిని.. నువ్ చీకటిలాంటి ఎలుగుబంటిలా పట్టి.. పట్టి.. నలిపి.. నలిపి పారేసినపుడు.. అయ్యో.. నీకు గుర్తులేదా! నాకు బాగా గుర్తుంది. రెక్కలు తెంపి.. నీ కామం వికృతంగా తీర్చుకుని నువ్ వెళ్ళిపోయేవు.. అప్పుడు నువ్వు గాయపరిచిన ఆ పదారేళ్ళ మల్లి నన్నేమని అడిగిందో తెలుసా? అమ్మో.. నేను మర్చిపోలేను–

'అబ్బా! ఎందుకక్కయ్యా? ఎందుకు? హయ్యో అకా ఎందుకు? హక్కాక్కా? అకా! ఎందుకు అకయ్యా.. అక్కయ్యా! వాడెందుకకా.. వాడెందుకు నన్నిలా చేయాలకా? హకయ్యా.. ఎందుకక్కయ్యా–అని అడిగింది మల్లి.

నేనేం జవాబు చెబ్దునో? ఏమో! నేనిప్పుడు చెప్పలేను. ఇంతలో మల్లిని వాళ్ళ అయ్య.. పోశయ్య వచ్చి ఏడ్చుకుంటూ.. ఇంతలో హుంకరిస్తూ.. మళ్ళీ ఏడుస్తూ.. తీసుకుపోయాడు.

ఏనాడో గ్నాపకం లేదు కానీ, ఓనాడు పగలు పదిగంటలపుడు వేసవి కాలపు గుమగుమలో.. మీ నాలుగిళ్ళ పక్క.. ఇంట్లో.. ఆ ఇంటి పక్కని మరో ఇంట్లో.. రంగురంగుల పంజరాల్లాంటి ఆ ఇళ్ళల్లో.. పి.జి.లు, పి.హెచ్.డి. లు చేసి.. భవిష్యత్తు స్వప్నాల్ని సుందరంగా కన్నాక.. నిన్ను.. ఓ ఇల్లాలు–నీ పక్కింటి సుబ్బిగాణ్ణి, ఇంకో ఇల్లాలు.. లెక్కలేనంత మంది విద్యాధికురాళ్లైన స్త్రీలు.. మీలాంటి వాళ్ళని పెళ్లాడిన తర్వాతర్వాత.. ఆకాంక్షల రెక్కలు తెగి.. గృహబానిసల్లా మారిపోయి.. నీకూ.. మీ అమ్మనాన్నలకి.. అక్కా చెల్లెళ్ళకు..తమ్ముళ్ళకి..నీ పిల్లలకి చాకిరీ చేస్తూ వంటమనిషిగా.. అంట్ల మనిషిగా..

చాకలిగా రూపాంతరం చెందుతూ.. చాకిరీ చేస్తూ.. జీర్ణవస్త్రంలా పిగిలిపోయి.. విసిగిపోయి చివరాఖరికి.. నరాలు తెగి..తెగి..మళ్ళీ అతికించుకోవడానికి వాలియమ్‌లు. యాంటీ డిప్రెసెంట్‌లు వాడుతూ పంజరాల్లో రామచిలుకల్లా.. రెక్కలు కొట్టుకుని.. కొట్టుకుని.. అలిసిపోయి.. ఎదుటి బీరువాల్లో మగ్గుతున్న పి.జి, పిహెచ్‌డి పటాల్ని చూస్తూ ఏమన్నారో.. ఏమంటున్నారో తెలుసా.. ఎందుకు.. అయ్యో.. ఎందుకు.. ఇవి.. ఈ కాగితాలు.. అన్నీ కలల్తోటి..అంతంత కష్టంతోటి..చదివి చదివి.. సాధించి..ఎందుకు ఇలా ఎందుకు.. ఎందుకక్కయ్యా.. ఈ పంజరాల మధ్య.. ఎందుకు.. ఎందుకక్కా.. అని! ఆ ప్రశ్నల్లోని అరుపు.. విసువూ..బరువూ..బాధా..గమనించిన నాకు.. నిజంగా చాలా భయం వేసింది.. ఆ బాధే.. ఈ ప్రపంచాన్నంతా ముంచేస్తే.. ఈ ప్రపంచం ఏమైపోవునో కదా.. అనుకున్నా నేను.



బొమ్మలు: అక్బర్

అలనాడు–నువ్వు అక్కడలేవు గాని–గవర్నమెంట్ హాస్పత్రి శవాల కొట్లో వాచ్‌మెన్ సారానోటి..వాసనలో ముప్పయి కాండిల్ దీపపు వెలుగుచీకట్లో దీపంమీద పడి వాళ్ళు కాలిపోయిన మాలచ్చిమ్మి శవం, వంటచేస్తూ.. పొరపాట్న కొంగంటుకు చచ్చిన సరళ, పద్మ, రుక్మిణి, రత్న, విజయల శవాలు, మొగుళ్ళు.. అత్తలు..కట్నమేదే పెళ్ళామా.. కట్నమేదే కోడలా అంటూ.. కిరసనాయిల స్నానాలు చేపించేసి..కాల్చేసి చంపేసిన సత్య లక్ష్మి సులోచన, వసంత, భారతి, శ్యామల, కోమల.. రుక్మిణి.. నీలిమ..ఫాతిమా..రజియా.. నూర్జహాన్లు.. నీరింకిపోయిన రక్తమూ.. కిరసనాయిలూ కలిసిపోయిన ఉడికిపోయిన శవాలు వేసిన ప్రశ్న.. నువు వినలేదు కానీ..నేను మాత్రం ఆ శవాల చిప్పిల్లిన పగిలిపోయిన కళ్ళల్లో..కాలి కమిలిపోయిన ఒంటినిండా.. ఆ ప్రశ్న చూశాను.. 'ఎందుకు? ఎందుకు?' ఆ శవాలే కాదు.. ఊరవతల రామాలయం పక్కన చెత్తకుండీలో బొక్కబోర్లా పడ్డ పదిరోజుల ఆడ పసికందు కళ్ళల్లో కూడా.. ఆ వెలుగు నీడల్లో ఆ ప్రశ్ననే వెర్రిగా చూపించేయి.. నాకు ఒణుకు పుట్టుకొచ్చింది. అతను వున్నాడేమోనని గబగబా వెతికేను. అతను కనిపించలేదు. వెళ్ళిపోయేడు కాబోలు నయం!



గ్నాపకం వుందా.. నువ్వోనాడు మీ తోటలో కెళ్ళే నాడు బాటలో రంగు వెలసిన నీ లూనామీద కూచుని వేగంగా అచ్చోసిన ఆంబోతులా.. పిచ్చెక్కిన చీంబోతులా వెళుతూ.. వెళుతూ..అలా వెళుతూనే..బస్టాపులో ఎపుడెపుడు ఇంటికెళ్ళిపోయి.. మొఖం కడిగేసుకుని.. చదువుకుందుకు కూర్చుందామా అని ఆతృతపడుతూ... బస్‌స్టాపులో నిలుచున్న అనూరాధ మొఖాన్ని ఆసిడ్‌తో కడిగేసేవు.. అనూరాధపై ఆసిడ్ భుగ..భుగ..చల్లారక ముందే.. సందుల్లో..గొందుల్లో గుంటనక్క మాదిరి మాటువేసి.. సైకిలుపై ట్యూషన్‌కి పోతున్న చిన్నారి సుజాతపై మళ్ళీ ఆసిడ్ పోసేసావు.. ఆసిడ్‌తో.. కళ్ళూ..ముక్కూ.. పెదిల్మని పగిలిపోయి.. రక్తకన్నీళ్ళు కారుస్తూ..గుడ్డిగుడ్డిగా.. గాలిలో తడుముతూ..అనూరాధ.. సుజాతలు..గావుకేకలు వేస్తుంటే చూడలేక భయపడి పారిపోయేవు.. కానీ.. ఆ ఎర్రెర్రనీ కళ్ళల్లో..ఆ ఎర్రెర్రని రక్తకన్నీళ్ళలో..ప్రశ్నలు.. హయ్యో..అ..బ్బ..ఆ..మ్మ..మ్మ..మ్మ.. ఎందుకకా..ఎందెందుకకా..ఇలా ఎందుకకా..వాళ్ళెందుకకా..అక్కడా నువ్వుండి వుంటే.. నాలాగే నువ్వూ భయపడి వుందువు..

***

ఆగస్టు పదేన్న.. చాకిలేటు ఆశ చూయిచ్చి..ఐదేళ్ళ అమీనా కూనని..ఆరేళ్ళ శ్వేత తల్లిని..మట్టిఛానళ్ళ మత్తువాసనకి మరిగిన పదేళ్ళ గౌతమిని..నువ్వు పాడుబడ్డ బంగళాకు తీసుకెళ్ళి..చిన్నారిపువ్వుల్ని.. గుండెల్ని.. ఎర్రెర్రగా చిదిమితే..ఆ పసి కూనలు నిస్సహాయంగా..వెర్రిగా..ఏమిటిది..ఎందుకు..అమ్మా..నాన్నా..అంకుల్.. వద్దు.. వద్దొద్దు..విడువు..నాకు చాకిలెటు వద్దు..

ఎందుకు ఆ..అమ్మా..వ్..ఎందుకు..ఇంతకుముందు నుపే ఎత్తుకుని నాన్నలా ముద్దాడిన అంకుల్.. ఎందుకు ఇట్లా..ఎందుకు అని ప్రశ్నిస్తే..నుల్చున్నకాడ్నే భూమిలో నన్నునేను పాతేసుకోవాలని పించింది... పదేళ్ళ జ్యోతిపై అత్యాచారం చేసేసి.. ఎక్కడా చెప్పవద్దని కత్రలతో.. కత్తులతో..ముక్కలు ముక్కలు చేసినపుడు.. అక్కడ పారిన ఎర్రెర్రని నెత్తురు..జ్యోతి తెరిచిన కళ్ళల్లో.. అరక్షణంపాటు మండిన ప్రశ్న కూడా అదే.. ఎందుకు..

***



మొన్నటికి మొన్న కట్టుకున్న పెళ్ళాం చచ్చింతర్వాత..ఎదిగిన కన్నకూతుర్ని చెరిచీసి.. కడుపు చేసిచ్చి..బిడ్డను కనిచ్చి..దానినోటెంబడి..నువ్వు నాన్నవా..తాతవా.. ఎవరివిరా నా కొడకా.. లమ్డి చెప్పరా.. నువ్వోడివిరా.. అన్న ప్రశ్నేయిచ్చుకున్నావు..గుర్తుందా.. కన్నతండ్రికి కూతుర్ని కన్న..ఆ కూతురు.. కళ్ళల్లో.. అయోమయంగా..దిగ్భ్రాంతి..దిగ్భ్రాంతిగా..కదిలిన ప్రశ్న.. ఎందుకు..కన్నతండ్రే ఇలా..నాన్నేనా ఇలా.. రెక్కల్లో పొదివి కాపాడాల్సిన నాన్నేనా..ఇలా..హ..బ్బా.. అయ్యో..చచ్చిపోనా నా అమ్మా..ఎందుకే..ఎందుకే.. అమ్మా..ఎందుకకా..ఎందుకక్కయ్యా? అంటూ.. దిమ్మెరపోయా.. బాధతో ఉంగలు చుట్టుకుపోయా..అడిగిన ప్రశ్న.. ఎందుకు? ఎందుకు?

ఇంకోనాడు..

అలనాడు–

ఓనాడు–

నిన్న–

ఇవాళ–

రేపు–

అనుక్షణం–ప్రతిక్షణం–

ఎన్నని చెప్పను? –ఎందరని చెప్పను?

అందరూ.. అడుగుతూనే వున్నారు. ■

(రావిశాస్త్రి రాసిన 'అడిగేరు' కథలో పీడితుల వేదనని ప్రచండమైన శైలిలో వర్ణించిన తీరుకి స్పందించి అదే శైలిలో స్త్రీలకోణం నుంచి ఈ కథ రాశాను. జులై 30 రావిశాస్త్రి జన్మదినం సందర్భంగా ఈ కథ ఆ మహా రచయిత స్మృతికి అంకితం)

★

వచ్చేవారం కథ

బోసినవ్వు

– కో. ప్ర